సాక్షి సంగారెడ్డి

బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



పెరిగిన బియ్యం కోటా
కొత్త రేషన్‌కార్డుల మంజూరు జిల్లాలో పంపిణీ చేసే బియ్యం కోటా ఈనెల నుంచి పెరిగింది. వివరాలు 8లో ▸



పందిరి సాగు.. ఫలితాలు బాగు
రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు.
వివరాలు 8లో ▸



స్కాన్ చేయండి..
పోలీసుల పనితీరును చెప్పేందుకు పోలీస్ ఉన్నతాధికారులు క్యూఆర్ కోడ్ స్కాన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.
వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను కలిసిన జెడ్పీ మాజీ చైర్మన్



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

సంగారెడ్డి: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ బాలయ్య కలిశారు. కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ కేసీఆరే సీఎం అవుతారని చెప్పారు. ఆయనతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య ఉన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు
భరోసా కేంద్రం ఇన్‌చార్జి మహేశ్వరి



సదస్సులో మాట్లాడుతున్న మహేశ్వరి

జోగిపేట(అందోల్): విద్యార్థుల జీవితాలను మలుపుతిప్పేది ఇంటర్మీడియేట్ అని.. ఈ రెండు సంవత్సరాలు ఎలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా ఉంటే మంచి భవిష్యత్‌ను పొందవచ్చని సంగారెడ్డి పోలీసుశాఖ భరోసా కేంద్రం ఇన్‌చార్జి మహేశ్వరి అన్నారు. మంగళవారం జోగిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యార్థులకు సెల్‌ఫోన్ల వినియోగం వల్ల కలిగే లాభాలు, నష్టాలను వివరించారు. సోషల్ మీడియా వల్ల జరుగుతున్న నేరాలు ప్రతిరోజు పత్రికలు, టీవీల్లో చూస్తున్నారని, అందుకు విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ వల్ల యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండు



మాట్లాడుతున్న పాండు

సంగారెడ్డి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచడమే కాకుండా తమిళనాడు తరహాలో చట్టబద్ధత కల్పించాలని ఓబీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో తీర్మానం ద్వారానే చట్టబద్ధత కలుగుతుందని , విద్యా, ఉద్యోగ రాజకీయాల్లో ఆర్టికల్ 9 ప్రకారం చట్టబద్ధత కల్పించాలన్నారు. గత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించి తీరని అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వమైనా బీసీలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, యువత జిల్లా అధ్యక్షులు జి.రమేష్ కుమార్, జిల్లా యువత నాయకులు నిఖిల్, కార్తీక్, కురువ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై వేటు
కంది (సంగారెడ్డి): కంది మండల పరిధిలోని తుంకిల్ల తండా పంచాయతీ కార్యదర్శి రేఖను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సదాశివపేట మండలం వెల్లూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆమె పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులు అందాయి. విచారణలో నిజమని తేలడంతో కలెక్టర్ వేటు వేశారు.

బాబుల్‌గాం.. అటా ఇటా!

రెవెన్యూ పరంగా కామారెడ్డి జిల్లా..
- పంచాయతీరాజ్ గెజిట్‌లో సంగారెడ్డిలోనే..
- రెండు జిల్లాల మధ్య నలుగుతున్న గ్రామం



బాబుల్‌గాంలో ప్రజాపాలన గ్రామ సభ నిర్వహిస్తున్న సంగారెడ్డి జిల్లా అధికార యంత్రాంగం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి– కామారెడ్డి జిల్లాల సరిహద్దు గ్రామం బాబుల్‌గాం సమస్య ఇంకా పూర్తి స్థాయిలో తీరలేదు. కర్నాటక సరిహద్దుల్లోని కంగ్టి మండలం పరిధిలో ఉన్న ఈ మారుమూల గ్రామంలో ఇప్పటికీ రెండు జిల్లాల అధికార యంత్రాంగం పాలన కొనసాగుతుండటం గమనార్హం. ఈ గ్రామంలోని భూములు, ఇతర రెవెన్యూశాఖ పరంగా పాలనంతా కామారెడ్డి జిల్లా అధికార యంత్రాంగం పరిధిలోకి మారింది. కానీ పంచాయతీరాజ్ పాలన విషయానికి వస్తే మాత్రం ఇప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో ఆ జిల్లాకు మారలేదు. పంచాయతీ గెజిట్‌లో కూడా ఇంకా సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉంది. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభను కూడా ఈ బాబుల్‌గాంలో సంగారెడ్డి అధికార యంత్రాంగమే నిర్వహించింది. కాగా, రాష్ట్ర ప్రణాళిక శాఖ సోమవారం తెలంగాణ అట్లాస్ (తెలంగాణ రాష్ట్ర స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్) –2024ను విడుదల చేసింది. కామారెడ్డి జిల్లా జుక్కల్ (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గం పరిధిని కామారెడ్డితో పాటు, సంగారెడ్డి జిల్లాలో కూడా ఉందని ఈ అట్లాస్‌లో పేర్కొంది.

ఈ గ్రామంలో ఎన్నికలు ఎవరు జరపాలి

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఓటరు జాబితా, రిజర్వేషన్ల ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఏ జిల్లా అధికారులు జరపాలనే దానిపై ఇటీవల తర్జన భర్జన జరిగింది. పంచాయతీరాజ్ గెజిట్ ప్రకారం ఈ గ్రామం సంగారెడ్డి జిల్లాలో ఉండగా, ఈ ఎన్నికల ఏర్పాట్లు మాత్రం కామారెడ్డి జిల్లా అధికార యంత్రాంగం చేసింది. టీ–పోల్ వెబ్‌సైట్‌లో కూడా సంగారెడ్డి జిల్లా పరిధిలోంచి తొలగించి కామారెడ్డి జిల్లా పరిధిలోనే మార్చారు.

అసెంబ్లీ ఆమోదంతోనే..

ఈ గ్రామం పూర్తి స్థాయిలో కామారెడ్డి జిల్లాలోకి వెళ్లాలంటే పంచాయతీరాజ్ గెజిట్‌లో మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం అసెంబ్లీ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఈ గ్రామం రెండు జిల్లాల పరిధిలో ఉన్నట్లు రికార్డులు చూపుతోంది. అలాగే జుక్కల్ (కామారెడ్డి జిల్లా) అసెంబ్లీ నియోజకవర్గం పరిధి సంగారెడ్డి జిల్లాలో కూడా ఉన్నట్లు చూపుతోంది.

ఇదీ గ్రామ చరిత్ర

బాబుల్‌గాం గ్రామం ముందుగా నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉండేది. ఈ గ్రామం ప్రజలు అప్పటి మండల కేంద్రం జుక్కల్‌కు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కౌలాస్‌నాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో పుట్టిల ద్వారా వెళ్లాల్సి వచ్చేది. రోడ్డు మార్గం ద్వారా వెళ్లాలంటే సుమారు 40 కి.మీటర్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఈ గ్రామానికి అధికారులు రావాలన్నా.. గ్రామస్తులు వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్నా అనేక ఇబ్బందులు తప్పేవి కావు. పుట్టిల్లో ప్రయాణించే సమయంలో పలుమార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఈ గ్రామంలో పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం నిర్వహణ సరిగా ఉండేది కాదు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేసే సమయంలో ఈ గ్రామాన్ని సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోకి మార్చింది. కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్‌ను కూడా కొత్త మండలం చేసింది. ఈ పెద్దకొడప్‌గల్ తమకు దగ్గర అవుతుందని బాబుల్‌గాం గ్రామస్తులు డిమాండ్ చేయడంతో ఈ గ్రామాన్ని సంగారెడ్డి జిల్లా నుంచి తొలగించి, పెద్ద కొడప్‌గల్ మండలం (కామారెడ్డి)లో చేర్చారు. రెవెన్యూ పరంగా రికార్డులను కూడా ఆ జిల్లా అధికార యంత్రాంగానికి అప్పగించారు. కానీ పంచాయతీరాజ్ గెజిట్ ప్రకారం ఇంకా సంగారెడ్డి జిల్లా పరిధిలోనే కొనసాగుతుండటం గమనార్హం.

ప్రతిపాదనలు పంపాం

బాబుల్‌గాం గ్రామం విషయంలో పంచాయతీరాజ్ గెజిట్‌లో మార్పులు చేయాలని కోరుతూ గతంలోనే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే ఈ గెజిట్‌లో మార్పులు చేర్పులు చేయనున్నారు.

–సాయిబాబ,
జిల్లా పంచాయతీ అధికారి



అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న హరిచందన

అమీన్‌పూర్‌లో స్కిల్ యూనివర్సిటీ

నవోదయ పాఠశాల కూడా..
- స్థలాన్ని పరిశీలించిన ఆర్‌అండ్‌బీ కార్యదర్శి హరిచందన

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ, నవోదయ పాఠశాల ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన మంగళవారం అమీన్‌పూర్‌లోని సర్వే నంబర్ 993లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. స్కిల్ యూనివర్సిటీ కోసం 15 ఎకరాలు, అలాగే నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం మరో 25 ఎకరాలు స్థలాన్ని కేటాయించే అవకాశం ఉంది. స్కిల్ యూనివర్సిటీ, నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వం భూములను పరిశీలించినట్లు హరిచందన తెలిపారు. త్వరలో ఇవి అమల్లోకి రానున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆమెతో పాటు జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ హరీష్ చంద్రప్రసాద్, కమిషనర్ జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే వేటు వేయండి

ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ మహేష్‌దత్



మాట్లాడుతున్న మహేశ్‌దత్, పక్కన కలెక్టర్

సంగారెడ్డి జోన్: ఎన్నికల విధులకు హాజరు కాని ఉద్యోగులను సస్పెండ్ చేయాలని నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ బి.మహేష్‌దత్ ఏక్కా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులు, ఏఆర్‌ఓ అధికారులతో ఎన్నికల విధులపై సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు తారా డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని, అంబేడ్కర్ స్టేడియంలోని డీఆర్సీ సెంటర్‌ను కలెక్టర్ క్రాంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎన్నికలకు ఎంతో తేడా ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణను సవాల్‌గా తీసుకొని పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఓటర్లు, అభ్యర్థులు ఉన్నత విద్యావంతులు ఉంటారని తెలిపారు. అభ్యర్థులు నిబంధనలపై అవగాహన కలిగి ఉంటారని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవరావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటికి ముందస్తు చర్యలు

- సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం
- కలెక్టర్ వల్లూరు క్రాంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ..జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ఇప్పటికే అనేక చర్యలు చేపట్టామని, మరింత సమర్థంగా అమలు చేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. జహీరాబాద్, నారాయణఖేడ్ వంటి ప్రాంతాలలో వేసవి ప్రారంభమయ్యే దశలోనే తాగునీటి కొరత ఎదురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. నీటి ఎద్దడి ఎదుర్కొనే గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అందులో భాగంగా మోటార్లు, పైప్‌లైన్లు, హ్యాండ్‌పంపుల మరమ్మతులు చేపట్టడం, గ్రామాల్లో తాగునీటి సరఫరా మెరుగుపరిచే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి అవసరాలను తీర్చేందుకు సింగూరు ప్రాజెక్టు జలాలను సమర్థవంతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ మాధూరి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా అధికారులు సాయిబాబా, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారిద్దాం

జహీరాబాద్: బాల్య వివాహాలను నివారించాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలితకుమారి అన్నారు. మంగళవారం జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బాల్యవివాహాల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వీఓ లీడర్లపై ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండని బాలిక, 21 సంవత్సరాలు నిండని యువకుడికి వివాహం చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు. అత్యవసరమైన సమయంలో మహిళలు హెల్ప్‌లైన్ నం.181, చైల్డ్ హెల్ప్ లైన్ నెం.1098, పోలీసు హెల్ప్‌లైన్ నెం.100కు కాల్ చేసి వారి సహాయం తీసుకోవచ్చని సూచించారు. బాల్య వివాహాలు, అక్రమ రవాణా, దత్తత మిషన్ వాత్సల్య పథకాల గురించి వివరించారు.

కార్పొరేట్ల లాభాలకే పెద్దపీట

రాజకీయ విశ్లేషకుడు పాపారావు



సెమినార్‌లో మాట్లాడుతున్న పాపారావు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేసి కార్మికుల సంక్షేమానికి కోతలు విధించిందని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పాపారావు అన్నారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కేబుల్ కిషన్ భవన్‌లో 'కేంద్ర బడ్జెట్– కార్మిక వర్గంపై ప్రభావం'అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం క్షేమంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. సంపద సృష్టించే కార్మిక వర్గానికి ఆదాయంలో వాటా దక్కడం లేదని వాపోయారు. పెట్టుబడిదారులకు రాయితీలు ఇవ్వడం ద్వారానే సంపద పెరుగుతుందనే భ్రమలో పాలకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. దేశంలోని కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం కోట్ల రూపాయల రాయితీలు, రుణాల మాఫీ చేస్తూ వచ్చినప్పటికీ ఉత్పత్తి 75శాతానికి మించి జరగలేదని వివరించారు. అందుకే 14 రకాల ఉత్పత్తి సంబంధిత ఇన్సెంటివ్‌లను రద్దు చేస్తున్నట్టుగా కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు. మధ్యతరగతి కుటుంబాలకు రూ.12లక్షల ఆదాయపన్ను రాయితీ ఇచ్చినంత మాత్రాన వారి ఆదాయాలు పెరగవని చెప్పారు. పన్ను రాయితీ వెనుక కూడా కార్పొరేట్ శక్తుల లాభాలు దాగి ఉన్నాయని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో పేదలకు జరిగిన అన్యాయంపై సెమినార్లు, సదస్సులు నిర్వహించి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. వివిధ సంఘాల నాయకులు మల్లేశం, సాయిలు, రామచంద్రం, జయరాజు, నరసింహులు పాల్గొన్నారు.

చెత్తను తగలబెడుతున్నారు

- వాయుకాలుష్యంతో సతమతమవుతున్నాం
- కొల్లూరువాసుల ఆగ్రహం



కొల్లూరు డంపింగ్ యార్డ్‌లో తగలబడుతున్న చెత్త

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్లపై చెత్తను తగలబెడితే చర్యలు తప్పవని హెచ్చరించే అధికారులు.. డంపింగ్ యార్డులో చెత్తను తగలబెడుతూ వాయుకాలుష్యానికి కారకులవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో చెత్త డంపింగ్ యార్డు కోసం గత ప్రభుత్వం ఐదెకరాల భూమిను కేటాయించింది. దానితో పాటు కోటి రూపాయల అంచనాతో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్‌ఎస్‌టీపీ) నిర్మించారు. కానీ అది ఇంత వరకు ప్రారంభోత్సవానికి నోచుకోవడంలేదు. దానితో పాటు రూ.25లక్షలతో కాంపోస్ట్ షెడ్, రూ.25లక్షలతో డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్‌ను నిర్మించారు. ఇన్ని సదుపాయలున్న తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తడి చెత్త, పొడి చెత్తతో ఎరువులను తయారు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉన్నతాధికారులు చెబుతున్నా.. స్థానిక అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. డంపింగ్ యార్డు పరిసరాల ప్రాంతంలో నివసించే వారు నిత్యం వాయుకాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమ సమస్యను పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.

17 ఏళ్ల కల సాకారమైన వేళ..

ఎట్టకేలకు డీఎస్సీ 2008 అభ్యర్థులకు పోస్టింగ్
- అభ్యర్థుల్లో వెల్లివెరిసిన ఆనందం
- జిల్లాలో 67 మందికి ప్రయోజనం



డీఈవో చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న అభ్యర్థి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సుదీర్ఘ నిరీక్షణ.. ఎగతెగని పోరాటం.. 17 ఏళ్లకు ఉద్యోగం వరించింది. 2008లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్థులు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకొని పరీక్ష రాశారు. కానీ తమకంటే తక్కువ అర్హత ఉన్నవారికి ఉద్యోగాలు ఇవ్వడంతో కోర్టు మెట్లు ఎక్కారు. నేడు న్యాయస్థానం ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలు పొందారు. సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలను చేపడుతుంది. డీఎస్సీ 2008 నోటిఫికేషన్ ఆధారంగా అర్హత సాధించిన వారిలో ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్) పోస్టులను 70 శాతం బీఎడ్, డీఎడ్ అభ్యర్థులతో భర్తీ చేయగా, మిగిలిన 30 శాతం డీఎడ్ అభ్యర్థులతో భర్తీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ కౌన్సెలింగ్‌కు హాజరై ఉద్యోగాలు పొందని బీఎడ్ అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. తమ కంటే తక్కువ అర్హత ఉన్న డీఎడ్ అభ్యర్థులకు 30 శాతం ఎస్జీటీ పోస్టులను రిజర్వ్ చేయడాన్ని సవాల్ చేశారు. అప్పటి నుంచి పోరాడుతుండగా నేటికి తెరపడింది. వారికి నియామక పత్రాలను అందజేయాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

జిల్లాలో 67 మంది

న్యాయస్థానం ఆదేశాలతో జిల్లాలో ఎస్జీటీ కేటగిరిలో డీఎస్సీ 2008 అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలు ఇచ్చారు. ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్‌కు హాజరైన వారందరికీ ఆయా మండలాల్లో ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టులను భర్తీ చేశారు. వీరికి నెలకు రూ.31,040 వేతనంతో నియమించగా ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు.

సీఆర్పీగా పని చేశా



2008లో డీఎస్సీ పరీక్ష రాసి కౌన్సిలింగ్‌కు హాజరయ్యాను. మమ్మల్ని కాదని డీఎడ్ వాళ్లకు ఉద్యోగాలు ఇవ్వడంతో కోర్టుకు వెళ్లడం జరిగింది. అప్పటి నుంచి సదాశివపేట మండలంలో సీఆర్పీగా పని చేయడం జరిగింది. కానీ ఇన్నేళ్లుగా సర్వీస్‌ను కోల్పోయాం. రెగ్యులర్ సర్వీస్ కోసం పోరాటం చేస్తాం.

– నిరంజన్ చారి, చీలపల్లి కాంట్రాక్ట్ ఎస్జీటీ

సంతోషంగా ఉంది



ఎట్టకేలకు మా పోరాటం ఫలించి ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. ఇంతకు ముందు కోహిర్ మండలంలో సీఆర్పీగా పని చేశాను. ప్రస్తుతం మొగ్దంపల్లి మండలంలోని జమ్గర్ బౌలి తండాలో ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగం వచ్చింది. 16 ఏళ్లుగా పోరాటం చేసినందుకు ఫలితం దక్కింది.

– రాజు, జమ్గర్ బౌలి తండా, కాంట్రాక్ట్ ఎస్జీటీ

67 మందికి పోస్టింగ్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 67 మందికి కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా నియామక పత్రాలను అందజేశాం. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయంలో మళ్లీ వీరంతా తిరిగి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. వీరికి నెలకు రూ 31,040 వేతనం ఉంటుంది.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

ఉద్యోగాల నుంచి తొలగించడం సరికాదు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్



కలెక్టరేట్ వద్ద సీఐటీయూ నాయకులు, కార్మికుల నిరసన

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో నాలుగేళ్లుగా పని చేస్తున్న కార్మికులను ఆకస్మాత్తుగా తొలగించడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. కార్మికులను డ్యూటీలోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కేవల్‌కిషన్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు కార్మికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్ మాట్లాడుతూ.. ఎంఆర్‌ఎఫ్ యాజమాన్యం కార్మికులను భయభ్రాంతులకు గురి చేసి ఉద్యోగం నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కరించమని అడిగితే ఉద్యోగం నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. తక్షణమే కార్మికులను డ్యూటీలోకి తీసుకొని కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లేశం, సాయిలు సీఐటీయూ జిల్లా నాయకులు రాజయ్య, ప్రవీణ్ కుమార్, మహిపాల్‌తో పాటు పరిశ్రమ కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తూప్రాన్‌లో కార్డెన్ సెర్చ్

సరైన పత్రాలు లేని

92 బైకులు, 5 ఆటోలు సీజ్

తూప్రాన్: అనుమానిత వ్యక్తులు కనిపించినా, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా తమ దృష్టికి తేవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తూప్రాన్ మున్సిపాల్టీ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో 7 బృందాలతో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 92 బైకులు, 5 ఆటోలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపి తమ వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు శివారులో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా మోకిల నుంచి రింగ్‌రోడ్డు మీదుగా కర్నూలు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో రింగ్ రోడ్డుపై రేషన్ బియ్యం తరలిస్తున్న లారీను పట్టుకొని 34 టన్నులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మంగళవారం సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

దాబాలో తనిఖీలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని నందికంది శివారులోని రాజస్థానీ దాబాలో మంగళవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రాజస్థాన్ కు చెందిన లక్ష్మణ్ రామ్ సదాశివపేట పట్టణంలో నివాసం ఉంటూ సొంత గ్రామం నుంచి పాపి స్ట్రా పౌడర్ కొని దాబా చుట్టుపక్కల వినియోగదారులకు అధిక ధరలకు అమ్ముతున్నాడు. నమ్మదిన సమాచారం మేరకు తనిఖీ చేసి 518 గ్రాముల పౌడర్, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని యజమాని లక్ష్మణ్ అదుపులోకి తీసుకున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, సీఐ వీణా రెడ్డి, ఎస్ఐ అనిల్ కుమార్, సిబ్బంది అలీం, సతీష్ మోహన్, గోపాల్, ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్శిటీకి భాగ్యరెడ్డి వర్మ పేరు పెట్టాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మల్లేశం

జోగిపేట(అందోల్): జోగిని వ్యవస్థను పూర్తిగా రూపుమాపడంలో కీలక భూమిక పోషించిన వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు ఎ.మల్లేశం అన్నారు. మంగళవారం జోగిపేటలోని హౌసింగ్ బోర్డు కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ 86వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాగ్యరెడ్డి వర్మ జీవితకాలమంతా అంటరానితనం, అసమానతలు, బాలికలకు విద్యా సౌకర్యాలు కల్పించడానికి కృషి చేసారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మేతరి కరుణాకర్, మండల అధ్యక్షుడు బహుజన ప్రసాద్, ఉపాధ్యక్షుడు రాజు, మున్సిపల్ అధ్యక్షుడు గోపాల్, లక్ష్మణ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెరిగిన బియ్యం కోటా

- 888 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు
- పాత కార్డుల్లో చేర్పులతో పెరిగిన లబ్ధిదారులు
- ప్రతీనెల 12 మెట్రిక్ టన్నుల బియ్యం అదనం
- నేటికీ కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- లబ్ధిదారుల్లో సంతోషం


రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ

సిద్దిపేటరూరల్: కొత్త రేషన్‌కార్డుల మంజూరు జిల్లాలో పంపిణీ చేసే బియ్యం కోటా ఈనెల నుంచి పెరిగింది. పదేళ్ల కాలంలో నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ లేకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారుల కల నెరవేరింది. జిల్లాలో మొదటి విడతగా 888 కుటుంబాల వారు అర్హత సాధించినట్లు వివరాలను వెల్లడించారు. వారందరికీ ఫిబ్రవరి నుంచే రేషన్ బియ్యం అందజేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో రేషన్ పంపిణీ చేసే బియ్యం అదనంగా 12 మెట్రిక్ టన్నులకు పెరిగింది.

జిల్లాలో ఇప్పటి వరకు గ్రామసభలు, ప్రజాపాలన కేంద్రాల్లో స్వీకరిస్తున్న దరఖాస్తుల్లో నూతన రేషన్‌కార్డులు, చేర్పులు, తొలగింపు వంటి వాటికి సంబంధించి 74 వేల 272 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు సంబంధిత అధికార యంత్రాంగం సర్వే పూర్తి చేయడంతో పాటుగా అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. మరి కొంతమంది మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో రేషన్ వివరాలు :

రేషన్ దుకాణాలు	684
రేషన్ కార్డులు	2,92,131
అంత్యోదయ కార్డులు	18341
మొత్తం లబ్ధిదారులు	8,95,467
అన్నపూర్ణ కార్డులు	82

నెలవారీగా పంపిణీ చేయాల్సిన బియ్యం **5,720** మెట్రిక్ టన్నులు

కొత్త కార్డు వచ్చింది



ప్రభుత్వ చేపట్టిన ఇంటింటి సర్వే సమయంలో నూతన రేషన్‌కార్డు కోసం దరఖాస్తు అందించాను. గత నెలలో నా పేరు మీద నూతన రేషన్ కార్డు వచ్చింది. చాలా రోజులుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికై నా రావడం చాలా సంతోషంగా ఉంది. దీంతో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పొందేందుకు అవకాశం ఉంది.

– పుల్లగూర్ల తేజ, రాఘవాపూర్

888 నూతన కార్డులు

జిల్లాలో కొత్తగా 888 కుటుంబాలకు ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేసింది. ఈ మేరకు చాలా మందికి లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే కార్డు ఉండి అందులో పిల్లల పేర్లు లేకుండా చాలా మంది ఉన్నారు. ఇందులో కొత్తగా 1,900 మందిని వారి పాత కార్డుల్లో చేర్చారు. వీరందరికీ ఈనెల నుంచి బియ్యాన్ని అందించాల్సి ఉండగా అదనంగా 12 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం పడుతుంది. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ ఉన్న దరఖాస్తుల్లోనూ అర్హులను గుర్తిస్తే ఈ కోటా మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది.

లబ్ధిదారుల్లో సంతోషం

ఎన్నో ఏళ్లుగా నిలిచిన రేషన్‌కార్డుల ప్రక్రియ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ముందుకు కదలడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డే ప్రామాణికం కావడంతో జిల్లాలో కార్డులేని వారు దశాబ్ద కాలంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు కాక, ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రుణాలు పొందలేక ఎన్నో అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో జిల్లాకు కొత్తగా 888 మందికి కొత్త కార్డులు రావడంతో తమకు కూడా ప్రభుత్వ పథకాలు వస్తాయనే నమ్మకం అర్హులైన దరఖాస్తుదారుల్లో ఏర్పడింది.

అర్హులందరికీ అందిస్తాం



జిల్లాలో ఇటీవల 888 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతోపాటు 1,900 మంది పేర్లను రేషన్ కార్డుల్లో కొత్తగా చేర్చాం. వీరికి బియ్యం అందించడం జరుగుతుంది. కొత్త కార్డులు రావడం, పాత కార్డుల్లో మార్పులు, చేర్పులు జరగడంతో జిల్లాలో ఈ నెల రేషన్ బియ్యం కోటా 12 మెట్రిక్ టన్నులకు పెరిగింది. తమ వద్ద ఉన్న దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుంది.

– తనూజ, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

పోషకాల లోపం.. ఎదుగుదలపై ప్రభావం

వ్యవసాయ అధికారులు


వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: సాగు భూమిలో పోషకాల లోపంతోనే వరి నాటు వేసిన తర్వాత ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుందని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేశ్ తెలిపారు. మంగళవారం రాయపోల్ మండల పరిధిలోని రాంసాగార్ గ్రామంలో వరి పొలాలను, రైతుల పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు చేసే వరి పంటలో చౌడు భూమిలో వరి ఎర్రబారి వేసిన కర్ర వేసినట్లు ఉండి పొలం అంతా బుడబుడగా ఉండి వరి వేర్లు నల్లగా మారి భూమి లోపలి పోషకాలు తీసుకోకపోవడంతో జింక్, ఇతర పోషకాల లోపాలు కనిపిస్తున్నాయన్నారు. నివారణకు 19.19.19 ఒక కేజీ ఎకరానికి + జింక్ సల్ఫేట్ 400–500 గ్రాములు ఎకరానికి రెండు సార్లు పిచికారీ చేసి, పొలం బాగా నెర్రలు వచ్చే లాగా ఆరబెట్టాలన్నారు. ప్రస్తుతం యాసంగి కాలంలో జింక్ లోపాలు ఎక్కువ కనిపించే అవకాశం ఉందని, జింక్ నివారణ కోసం జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, స్వర్ణలత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరబెడుతూ నీటి తడులు అందించాలి

వరి పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు

సాక్షి ఎఫెక్ట్..


దుబ్బాకలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దుబ్బాక: ఎవరికీ రాకూడని కష్టం.. ఎర్రబడి చచ్చిపోతున్న వరి చేలు పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. మంగళవారం వ్యవసాయాధికారులు జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి వరి పంటలను పరిశీలించారు. దుబ్బాక మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, ఏఈఓ మనోజ్ఞ పట్టణంలోని కేసుగారి స్వామి, గుండెల్లి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు రైతుల పంటలను పరిశీలించారు. నాట్లేసి 45 రోజులు గడుస్తున్నా వరిపంటలు ఎదుగుదల లేకుండా కుళ్లిపోయి, ఎర్రబడి చచ్చిపోతుండడాన్ని గమనించారు. మొగి పురుగు, వాతావరణ పరిస్థితులు, భూములు తడి ఆరకుండా ఉండడంతోపాటు జింక్ తదితర సమస్యలతో పంటలకు నష్టం జరుగుతుందని గమనించారు. మొగి పురుగు ఎక్కువగా ఆశించిన పంటలకు కార్టాప్ 4 జీ గుళికలు లేదా క్లోరంత్రానిలిప్రోలే లేదా బరోజ్ వంటి మందులు వేసుకోవాలన్నారు. వరి పంటలను ఆరబెడుతూ నీటి తడులు అందించాలి. పలు సస్యరక్షణ చర్యలను రైతులకు సూచించారు.

మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య

తంప్లూర్‌లో వ్యక్తి

టేక్మాల్(మెదక్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టేక్మాల్ మండలంలోని తంప్లూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ దయానంద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాకలి అశోక్ (38), వెంకట్రావు పేటకు చెందిన వెంకటలక్ష్మికి 20 ఏళ్ల కింద వివాహం జరిగింది. వీరిద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వీరిద్దరి మధ్య కుటుంబ విషయంలో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. 16న దంపతులిద్దరూ తంప్లూర్ గ్రామానికి వచ్చారు. అదే రోజు మధ్యాహ్నం ఇంటి వద్ద గొడవ జరగడంతో వెంకటలక్ష్మి హైదరాబాద్ వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అశోక్ సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి చాకలి పోచయ్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నార్సింగ్‌లో యువకుడు

పాపన్నపేట(మెదక్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని నార్సింగిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. మధ్యప్రదేశ్ కు చెందిన సంజీవ్ కుమార్ (25) ఉపాధి నిమిత్తం రాష్ట్రానికి వచ్చి కామారెడ్డికి చెందిన శ్రీలత అనే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా పాపన్నపేట మండలం నార్సింగి గ్రామంలో వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని చెప్పినా వినకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న భార్య శ్రీలత ఘటనా స్థలికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వివాహేతర సంబంధంతో

హత్యాయత్నం

- మహిళ భర్తపై దాడికి పాల్పడ్డ యువకుడు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

సిద్దిపేటకమాన్: మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న యువకుడు ఆమె భర్తపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. ఐల శ్రీధర్, భార్య ఇద్దరు పిల్లలతో కలిసి గుండ్ల చెరువులో నివాసం ఉంటున్నాడు. శ్రీధర్ పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మెరుగు శ్రావణ్ (21) సదరు మహిళతో కొద్ది రోజులుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీనికి గాను అడ్డు తొలగించుకోవాలని శ్రవణ్‌తో కలిసి భర్త శ్రీధర్‌ను చంపడానికి పథకం వేసింది భార్య. గత నెల 11న రాత్రి పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న శ్రీధర్‌ను శ్రావణ్ లిఫ్ట్ అడిగాడు. ఇద్దరూ బైక్‌పై వెళ్తున్న క్రమంలో నర్సాపూర్ చౌరస్తా సమీపంలో యువకుడి ఇద్దరు స్నేహితులు వీరి వెనుకాలే వచ్చారు. ముగ్గురూ కలిసి శ్రీధర్‌ను కిడ్నాప్ చేసి కాళ్లు, చేతులు కట్టేసి దాడి చేశారు. మళ్లీ రెండోసారి గత నెల 20న శ్రీధర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా 12న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం ప్రధాన నిందితుడు మెరుగు శ్రావణ్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచి వందశాతం పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పంచాయతీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అధికారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్ను చెల్లింపు అవసరాన్ని తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఇంటి యజమానులు, ఇంటి పన్ను చెల్లించేందుకు ముందుకు రావాలని కోరారు. రేషన్ కార్డుల వెరిఫికేషన్ పూర్తిగా పారదర్శకంగా జరగాలని అర్హులైన వారికి మాత్రమే రేషన్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూర్తి సమాచారం అధికార యంత్రాగణానికి అందుబాటులో ఉండాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, పాఠశాలలను, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీపీఓ సాయిబాబా, ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు


శివ్వంపేటలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్: పోలింగ్ కేంద్రం వద్ద నిబంధనల మేరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఎస్ఐ లింగంకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కాలేజీలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను, ఓటరు జాబితాను పరిశీలించారు. ఎస్ఐ, మండల ఆర్ఐ ఫైజల్ పోలింగ్ స్టేషన్ల వివరాలను ఎస్పీకి వివరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించి కేసులను త్వరగా ఛేదించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని ఎస్ఐకి సూచించారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేట ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సీఐ రంగక్రిష్ణ, ఎస్ఐ మధుకర్‌రెడ్డి ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


లక్ష్మయ్య (ఫైల్)

టేక్మాల్(మెదక్): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొడ్మట్‌పల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్ఐ దయానంద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చీలపల్లి లక్ష్మయ్య(59) రజక వృత్తితోపాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తరచుగా చేపలు పట్టేందుకు వాగుల్లోకి, కుంటల్లోకి వెళ్లేవాడు. 14న ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఆచూకీ కోసం బంధువులు, వ్యవసాయ పొలాల వద్ద వెతుకుతుండగా 17న రాత్రి గుండువాగు గడ్డపై లక్ష్మయ్య బట్టలు, సెల్‌ఫోన్, చెప్పులు కనిపించాయి. వాగులోకి పరిశీలించి చూడగా లక్ష్మయ్య మృతదేహం కనిపించింది. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య చీలపల్లి పోచమ్మ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు

పుల్‌కల్(అందోల్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పుల్‌కల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. పుల్‌కల్ గ్రామానికి చెందిన బోయిని నవీన్ (25) సోమవారం రాత్రి కడుపునొప్పి భరించలేక ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పుల్‌కల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం

కామారెడ్డి జిల్లాలో సిర్గాపూర్ మండలానికి చెందిన మహిళ మృతి


శకుంతల మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): కామారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిర్గాపూర్ మండలం అంతర్‌గామ్‌కు చెందిన మహిళ మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అంతర్‌గామ్‌కు చెందిన సంగయ్య, శకుంతల(55) దంపతులు బైక్‌పై మంగళవారం కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పెద్దకోడప్‌గల్ గ్రామంలోని బంధువుల ఇంటికి బయల్దేరారు. చిన్నకోడప్‌గల్ వద్ద సంగారెడ్డి–నాందేడ్ 161 నేషనల్ హైవేపై వెనుక నుంచి బొలేరో వాహనం వీరి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో స్థానికులు పిట్లం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో శకుంతల మృతి చెందింది. సంగయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పిట్లం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త రకం శనగతో అధిక దిగుబడులు

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పల్లవి


శనగ పంటపై పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్తలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు ఎన్‌బీ ఈజీ 47 కొత్త రకం శనగను సాగు చేసుకోవాలని, దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పల్లవి, కో ఆర్డినేటర్ విజయ్ తెలిపారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్, అలిరాజ్‌పేట గ్రామంలో రైతుల పొలాల్లో వ్యవసాయ శాఖ సహకారంతో క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రకం శనగను సాగు చేస్తే నిటారుగా పెరగడమే కాకుండా కాయ పైకి వస్తుందని, మెషిన్ హార్ వెస్టింగ్ చేసుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. ఎండు తెగుల్ని సమర్థవంతంగా తట్టుకొని 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. అనంతరం ఎనుగుల శ్రీనివాస్‌రెడ్డి రైతు పొలంలో వేసిన ధనియాల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఏఈఓ కవిత, రైతులు పాల్గొన్నారు.

పందిరి సాగు.. ఫలితాలు బాగు

- ఉద్యాన పంటలతో సిరులు
- ఆసక్తి చూపుతున్న రైతులు


పందిరి సాగు విధానంతో బీరకాయ సాగు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆరుగాలం కష్టపడి ప్రకృతి వైపరీత్యాలు తట్టుకొని వరి సాగు చేస్తే సరైన దిగుబడి రాక, గిట్టుబాటు ధర అందడం లేదని ఆందోళన చెందుతున్న రైతులు తమ ఆలోచను మార్చుకుంటున్నారు. సంప్రదాయ పంటలకు బదులుగా ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ తమకున్న కొద్దిపాటి సాగు భూమిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉత్పత్తులు, ఉద్యాన పంటల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటే సాగును లాభాల బాటలో నడిపించొచ్చని నిరూపిస్తున్నారు. చిన్నకోడూరు మండలంలో సుమారు 90 ఎకరాల్లో పందిరి సాగు ద్వారా కూరగాయలు పండిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

పందిరి సాగుతో మేలు

రైతులు వారి భూముల్లో పందిరి వేసి, ఉద్యాన పంటను సాగు చేస్తే మంచి లాభాలను పొందవచ్చు. ఎకరా భూమిలో పందిరి సాగు అమలు చేసే రైతులు ఉద్యానశాఖ ద్వారా రూ. లక్ష సాయం అందిస్తుండగా, ఇందులో రూ. 50 వేలు సబ్సిడీ వస్తుంది. మిగితా సగాన్ని రైతులు భరించాల్సి వస్తుంది. అధికారులే పందిరి సిద్ధం చేసి ఇస్తారు. సుమారు నాలుగేళ్ల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీగజాతి కూరగాయలు పండించుకోవచ్చు. కాకర, బీర, దొండ, సోరకాయ పండిస్తూ ఆదాయం పొందవచ్చు. పందిరి కింది బాగంలో ఖాళీగా ఉన్న స్థలంలో టమాట, వంకాయ, బెండ వంటి అంతర పంటలు సాగు చేయవచ్చు.

దిగుబడి బాగుంది

పందిరి సాగు విధానంతో దిగుబడులు బాగున్నాయి. ఈ విధానం ద్వారా కలుపు తక్కువగా ఉండి కూలీల అవసరం ఉండదు. కూరగాయలు కుళ్లిపోకుండా ఉంటాయి. చీడ పీడలు ఎక్కువగా ఆశించవు. పంటలు సాఫీగా వస్తాయి. మార్కెట్‌ల మంచి ధర పలుకుతుంది.

–నాగర్తి తిరుపతిరెడ్డి, రైతు మాచాపూర్